

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు క్రీడాకారులు ఎంపిక



ప్రతిభ చూపిన క్రీడాకారులతో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రైల్వేకోడూరు : ఇటీవల చిట్వేలి మండల కేంద్రంలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వైసిపి కార్యాలయానికి రావడంతో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అభినందించారు. నియోజకవర్గం నుంచి అండర్-17 కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు, అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఐదుగురు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం అండర్-14 జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు హెచ్ఎంఎం స్కూల్ సంబంధించిన 8వ తరగతి విద్యార్థి మద్దిరెడ్డి స్వామిని కొరముట్ల అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎంఎం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ దేవసుందరం, ఉప సర్పంచ్ శివ సాయి, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ మలిశెట్టి రమణ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, సిహెచ్ రమేష్, ఎంపిటిసి బండారు మల్లి, కనకరాజు, పిఇటి శివశంకర్ రాజు, డివి రమణ పాల్గొన్నారు.

27, 28న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 27, 28వ తేదీల్లో విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయాంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామ్రాజ్యవాద, బడా కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేసి దేశ ప్రజానీకంపై అన్ని రకాల భారాలు వేసి అసమానతలను పేదరికాన్ని నిరుద్యోగం పెంచి పోషిస్తున్నారని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుకుంటూ సామాన్యులపై భారాలు మోపుతున్నారన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. రైతులు, పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్త ప్రయోజనాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులలోని లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్లకు ఉదారంగా అందజేస్తూ, 9 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ పేరుతో రుణమాఫీ చేసిందని చెప్పారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల రుణాలు మాఫీ చేయడానికి మోడీ ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీల రుణాలు మాఫీ చేయడం కాదని తెలిపారు. రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓడరేవులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ సంస్థలు, రైల్వే, బొగ్గు గనులు, చివరకు ఆదివాసి, గిరిజనుల అటవీ భూములపై హక్కులను హరిస్తూ తాజాగా అటవీ చట్టానికి సవరణ పాస్ చేసిందని విమర్శించారు. ఈ చర్యలన్నీ కార్పొరేట్లకు ప్రత్యేకంగా మోడీ మానస పుత్రుడు గౌతమ్ అదానీని ప్రపంచ కుబేరులలో మొదటి స్థానానికి చేర్చేందుకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. సామాన్య ప్రజలపైన పన్నుల భారాన్ని పెంచుతూ, కార్పొరేట్లకు ఐటి, ఎక్సైజ్, కస్టమ్స్, కార్పొరేట్ టాక్స్‌ల పైన లక్షలాది కోట్ల రూపాయల రాయితీలను ఇస్తున్నదని పేర్కొన్నారు. మరోవైపు కార్మికుల హక్కులను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని తెలిపారు. ఫలితంగా బలహీన వర్గాల ప్రజల ఉపాధికి నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు లాభాలు పెంచి ప్రజల సంపదలు లూటీ చేస్తున్న కార్పొరేట్లను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు డి.వెంకట్రామయ్య, డి.భాగ్యలక్ష్మి, ఎస్.మెహరున్నీసా, ఎస్ ఓబులమ్మ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** విజయవాడ మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ పిలుపునిచ్చారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలతో కలిసి మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విఆర్ఎలు పెంచలయ్య, సుబ్బారాయుడు, అచ్చమ్మ పాల్గొన్నారు.

'పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి'



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా అన్నారు. శుక్రవారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఓటర్ల నమోదు, ముసాయిదా జాబితాలో ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఎపిక్ కార్డుల ప్రింటింగ్, పంపిణీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో విసి ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ విసి హాలు నుంచి కలెక్టర్ గిరీష, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, డిఆర్ఒ సత్యనారాయణ, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ జెండర్ రేషియో, జంక్ క్యారెక్టర్స్, 10 కంటే ఎక్కువ ఓట్లు వుండి పెండింగ్‌లో ఉన్న వాటికి సంబంధించి ఇంటింటి సర్వేలో పూర్తి స్థాయి విచారణ చేపట్టి ఓటర్ల జాబితా సవరించాలన్నారు. 18 ఏళ్లు పూర్తయిన వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా ఆయా జిల్లాలలోని అన్ని కళాశాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. తహశీల్దారులు, బిఎల్ఒలు ఓటు హక్కు గురించి, ఓటు యొక్క ప్రాధాన్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అర్హులందరిని ఎన్రోల్మెంట్ చేయించాలన్నారు.ముసాయిదా ఓటర్ల జాబితాలో ఒకే రకమైన ఫోటోలు, ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి మారిపోయినవి, మృతులు, ఒక ఇంటి నెంబర్ పై 10 కంటే ఎక్కువ ఓట్లు, ఒకే వ్యక్తి పేరున రెండు మూడు అంతకన్నా ఎక్కువ ఓట్లు ఉండడం లాంటి సిమిలర్ ఓట్ల తొలగింపునకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు బాధ్యతాయుతంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధివిధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామని మీనాకు వివరించారు. జిల్లాలో డూప్లికెట్ ఓటర్లు, ఇతర ప్రదేశాలకు వలసపోయిన వారు, మరణించిన వారు, కొత్తగా వివాహమై వేరే ఊళ్లకు వెళ్లిన వారు, పునరావృతమైన పేర్లు వంటి తొలగింపుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఫారమ్ 6 ఫారమ్-7, ఫారమ్-8ల పెండిన్సిలు, అన్ ప్రాసెస్డ్ అప్లికేషన్లను ఎప్పటికప్పుడు పూర్తి చేసి అప్డేట్ చేయడం జరుగుతుందన్నారు. ఫిర్యాదులు వచ్చిన అప్లికేషన్లపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. ముసాయిదా జాబితాలో ఓటర్ల చేర్పులు, తొలగింపులను సూక్ష్మ దృష్టితో పరిశీలించి ఓటర్ల సవరణ జాబితాను రూపొందిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, ఓటర్ల జనాభా నిష్పత్తి, లింగ నిష్పత్తి,రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఎపిక్ కార్డుల ప్రింటింగ్ వంటి అంశాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి 18-19 ఏళ్లు ఉన్న వారందరి ఓటరుగా నమోదు చేయించుకున్నారన్నారు. జిల్లాలోని ఎన్నికల నిర్వహణ అధికారులు వారికి అప్పగించిన బాధ్యతలను విధులను సక్రమంగా నిర్వర్తిస్తే రాబోవు ఎన్నికలను సమర్థవంతంగా ప్రశాంతంగా నిర్వహించుకోవచ్చునని పేర్కొన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి వచ్చే సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలని కలెక్టర్ వారికి సూచించారు.

ప్రజల చెవుల్లో కాలీఫ్లవర్ పెడుతున్న వైసిపి ప్రభుత్వం

- టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని



కాలీఫ్లవర్‌తో నిరసన తెలుపుతున్న పంతగాని

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రజల చెవుల్లో పువ్వుల బదులు క్యాలీఫ్లవర్లను వైసిపి ప్రభుత్వం పెడుతోందని టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంత గాని నరసింహప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 15 ఏళ్లుగా ఒకే ప్రజా ప్రతినిధిగా ఉన్నా అభివృద్ధి శూన్య మని విమర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే రూ.215 కోట్లు ఖర్చు చేసి సోమశిల బ్యాక్ వాటర్‌ను తెస్తామని చెప్పడం ఎన్నికల స్టంట్ మాత్రమేనన్నారు. ఇరిగేషన్ పనులు పూర్తి స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రైల్వేకోడూరుకు కాంట్రాక్టర్లు రావాలంటే బెంబేలెత్తి పోతున్నారన్నారు. ఒక్కో పనికి రెండు సార్లు భూమి పూజలు చేస్తున్నారని, పనులు మాత్రం పూర్తి స్థాయిలో జరగడం లేదని తెలిపారు. రానున్న ఎన్నికలలో తప్పక ప్రజాప్రతినిధిని ఇంటికి తరిమే రోజులు దగ్గరలో ఉన్నాయని పేర్కొన్నారు. చిట్వేలి మండలంలోని గొట్టి మానుకోన, కొన్ని చిన్న చిన్న ఇరిగేషన్ పనులు పూర్తిస్థాయిలో చేయలేకుండా తట్ట మట్టి కూడా వేయలేక పోతున్నారని తెలిపారు. ఎమ్మెల్యేగ గెలిచి సొంత పనులు చేసుకుని స్వలాభం పొందుతున్నాడని విమర్శించారు.

అనాథ బాలికలకు విద్యార్థుల చేయూత

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని సుదర్శన్ థియేటర్ సమీపంలోని 'బాలసదన్' అనాథ పిల్లలకు నారాయణ పాఠశాల ఇ-కిడ్స్ విద్యార్థుల తరపున శుక్రవారం దుస్తులు, పండ్లు, సబ్బులు, బ్రష్‌లు, ఆడపిల్లలకు కావలసిన వస్తువులు అందించారు. చిన్నతనం నుంచి మంచి అలవాట్లు, సేవాతత్పరత నేర్పడం వలన విద్యార్థులు భవిష్యత్తులో సామాజిక బాధ్యతతో మెలుగుతారని పాఠశాల ప్రిన్సిపల్ గీత పేర్కొన్నారు. తమ పాఠశాల విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలలో ముందుంటారని చెప్పారు. కార్యక్రమంలో బాలసదన్ సూపరింటెండెంట్ వై.సుజమణి, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ హెచ్.రమేష్, శారద, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



వస్తువులు అందజేస్తున్న నారాయణ పాఠశాల విద్యార్థులు



కుస్తీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కుస్తీ ఎంపిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్.ఎం.వి.నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం జెఎన్‌టియు ఇంట్రా యూనివర్సిటీ కుస్తీ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా జెఎన్‌టియు సెక్రటరీ ఆఫ్ స్పోర్ట్స్ కౌన్సిల్ బి.జోజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఎంపికల్లో బాలురు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. తమ కళాశాలలో ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ క్రీడలలో ప్రతిభ చాటిన విద్యార్థులు జెఎన్‌టియు తరపున పంజాబ్, ఛండీగర్ యూనివర్సిటీలో నవంబర్ 28వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు జరగబోయో ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయ రెజ్లింగ్ పోటీలలో పాల్గొననున్నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్, ఈవెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.నాగముని పేర్కొన్నారు. కె.సాయి విఘ్నేశ్వర్ రెడ్డి (ఎఐటిఎస్, రాజంపేట), జె హరి ప్రసాద్ (వేము కాలేజ్, చిత్తూరు), కె.బి ఖాదర్‌బాష (ఎఐటిఎస్, రాజంపేట), కె జగన్ మోహన్ రెడ్డి(ఎఐటిఎస్ రాజంపేట), కె వెంకటేష్ (ఎఐటిఎస్, కడప), కె.సుస్మిత (ఎఐటిఎస్ రాజంపేట), కె.అర్చన (ఎస్‌పిసి, తిరుపతి), మునిశేఖర్ (ఎఐటిఎస్, రాజంపేట), సి.వందన (కెఎస్ఆర్ఎం కడప), పి.సుమన్ (ఎఐటిఎస్, రాజంపేట), పి.విష్ణు (జెఎన్‌టియు, అనంతపురం), డి.అభిషేక్ (నారాయణ, గుడూరు), కె.వంశీకృష్ణ (ఎస్‌విసి, తిరుపతి) కుస్తీ పోటీల్లో ప్రతిభ చాటారని జెఎన్‌టియు సెక్రటరీ ఆఫ్ స్పోర్ట్స్ కౌన్సిల్ బి.జ్యోజిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఐఎస్ కోచ్, రెఫరీలు కె.గణేష్, సి.రేణుక, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్.సైఫుల్లాలు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఎఐటిఎస్‌లో శుక్రవారం ఆర్‌డిఒ బి.రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలని, ఓటు కార్డులో మార్పులు, చేర్పులు కూడా చేసుకోవచ్చునన్నారు. ఓటు నమోదును ఆన్ లైన్ ద్వారా, ఆఫ్ లైన్ ద్వారా ఎలా ఓటును నమోదు చేసుకోవాలో అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటును తప్పక నమోదు చేసుకోవడంతోపాటు వారివారి గ్రామాలలో ఓటు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు, విద్యార్థులకు సూచించారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు ఏయే వెబ్ సైట్ల ద్వారా నమోదు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎల్.ఓబులపతి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అడుగంటిన ప్రాజెక్టులు

డెడ్ స్టోరేజీ దిశగా పరుగులు

33 టిఎంసిలకు పడిపోయిన వైనం

రోజురోజుకూ తగ్గుతున్న నీటి మట్టాలు

వేసవిలో తాగునీటికీ కటకటే..!

ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో జలసిరి అడుగంటిపోతోంది. జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్, తెలుగుగంగ, తుంగభద్ర ప్రాజెక్టుల పరిధిలో 11 సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. విభజిత జిల్లాల నేపథ్యంలో కడప జిల్లాలో 84 టిఎంసిలు నిల్వల్లో 33 టిఎంసిలకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జూన్ నుంచి నవంబర్ వరకు ఆశించిన వర్షపాతం నమోదవని నేపథ్యంలో డెడ్ స్టోరేజీ దిశగా పరుగులు తీస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. గండికోట, బ్రహ్మసాగర్, మైలవరం మినహా మిగిలిన ప్రాజెక్టులన్నీ తాగునీటి అవసరాలు తీర్చడానికి పరిమితమయ్యాయి. జిల్లాలోని ప్రాజెక్టులను సాగునీటి అవసరాలు తీర్చాలనే ఉద్దేశంతో నిర్మించిన సంగతి తెలిసిందే. ప్రతి ఏటా కృష్ణా జలాలు ఆవసరం మేర అందని నేపథ్యంలో తాగునీటి అవసరాలకు పరిమితమయ్యాయి. ప్రస్తుత తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేసవిలో తాగునీటికి ఎద్దడి నెలకొనే అవకాశం ఉందనిపిస్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనుల్ని పూర్తి చేస్తే సుమారు 22 లక్షల ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంది. జిల్లాలో కెసి కెనాల్ ప్రధాన సాగు నీటి వనరుగా నిలిచింది. రూ.వేలాది కోట్లతో నిర్మితమవుతున్న రిజర్వాయర్లు, ప్రాజెక్టులు ఆశించిన ప్రయోజనాలను నెరవేర్చడం లేదు. జిల్లాలోని 11 సాగునీటి ప్రాజెక్టుల్లో గండికోట, పైడిపాలెం, చిత్రావతి మినహా మిగిలిన ప్రాజెక్టులన్నీ డెడ్‌స్టోరేజీ దిశగా పరుగులు తీస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో గండికోట, బ్రహ్మంసాగర్, మైలవరం, పైడిపాలెం, సర్వరాయసాగర్, ఎస్ఆర్-1, ఎస్ఆర్-2, అన్నమయ్య, వెలిగల్లు, చిత్రావతి, లోయర్‌సగిలేరు, ఎగువ సగిలేరు, బుగ్గవంక ప్రాజెక్టులను నిర్మించారు. కృష్ణాజలాలతోనే సాగునీటి ప్రాజెక్టులు జలకళను సంతరించుకోవాల్సి ఉంది. ఈ ఏడాది శ్రీశైలం రిజర్వాయర్‌కు నామమాత్రంగానైనా వరద ప్రవాహం లేకపోవడంతో కృష్ణాజలాలు ప్రశ్నార్థకంగా మారడం తెలిసిందే.

గండికోట ప్రాజెక్టు : 26.850 టిఎంసిల సామర్థ్యం కలిగి ఉంది.13.857 టిఎంసిలు మాత్రమే నీరు నిల్వ ఉంది. పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ నుంచి సుమారు 106 కిలోమీటర్ల మేరకు గాలేరు-నగరి-1 దశలోని పనులు పూర్తి చేయాల్సి ఉంది. పనుల్ని పూర్తి చేయకపోవడంతో కృష్ణాజలాలు అందని మానిపండు చందంగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

మైలవరం రిజర్వాయర్ : 9.960 టిఎంసిల సామర్థ్యంతో నిర్మితమైంది. 2.223 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉంది. సాగు నీటి అవసరాల నిమిత్తం ఏర్పాటు చేశారు. సప్లయ్ కెనాల్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ : 10 టిఎంసిల సామర్థ్యంతో నిర్మితమైంది. 5.225 టిఎంసిలను కలిగి ఉంది. ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీ దిశగా పయనిస్తోంది. వేసవి నాటికి తాగునీటి సరఫరాను సైతం అందించలేని దుస్థితికి చేరుకోనుంది.



బ్రహ్మసాగర్ రిజర్వాయర్‌లో తగ్గిన నీటి మట్టం

బ్రహ్మసాగర్ : 17.73 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో నిర్మితమైంది. 4.158 టిఎంసిల నిల్వను కలిగి ఉంది. ఆర్‌టిపిపికి ఇవ్వాల్సిన 1.5 టిఎంసిలను మినహాయిస్తే తాగునీటి అవసరాలకు పరిమితం కానుందనే వాదన వినిపిస్తోంది. 1.75 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది.

పైడిపాలెం రిజర్వాయర్ : ఆరు టిఎంసిల నిల్వ సామర్థ్యంతో నిర్మితమైంది. 5.120 టిఎంసిలను కలిగి ఉండడం ఊరట కలిగిస్తోంది. సప్లయ్‌ఛానళ్లు లేకపోవడంతో నిండు కుండను పోలి ఉంటుంది.

సర్వరాయసాగర్ రిజర్వాయర్ : 3.060 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో చేపట్టారు. 0.740 టిఎంసిలను కలిగి ఉంది.

వామికొండ సాగర్ : సర్వరాయసాగర్‌తో అనుసంధానించబడి ఉంది. 1.658 టిఎంసిల సామర్థ్యంతో నిర్మితమైంది. 1.371 టిఎంసిల నిల్వ ఉంది.

సబ్సిడరీ రిజర్వాయర్-1: తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన ఎస్ఆర్-1 2.135 టిఎంసీల సామర్థ్యంతో నీటి నిల్వను కలిగి ఉంది. 0.297 టిఎంసిల నిల్వ నీటిని కలిగి ఉంది. తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమితమవుతోంది.

సబ్సిడరీ రిజర్వాయర్-2 : తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన ఎస్ఆర్-2 2.447 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది.0.699 టిఎంసిల నీటి నిల్వలను కలిగి ఉంది.

వెలిగల్లు ప్రాజెక్టు : 4.64 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉంది.3.154 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది. 24 వేల హెక్టార్ల ఆయకట్టు ఉంది. వెలిగల్లు ప్రాజెక్టు రాయచోటి పట్టణవాసుల తాగునీటి సమస్యను తీరుస్తోంది.

బుగ్గవంక ప్రాజెక్టు : 0.506 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. 0.049 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది. తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమితమైనట్లు తెలుస్తోంది.

అన్నమయ్య ప్రాజెక్టు : 4 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2021 కురిసిన భారీ వర్షపాతానికి ఆనవాళ్లు లేకుండా తెగిపోయింది.

లోయర్ సగిలేరు : 0.170 టిఎంసిల నీటినిల్వ సామర్థ్యంతో నిర్మితమైంది. ప్రాజెక్టులో 0.030 టిఎంసిలను కలిగి ఉంది. 13 వేల ఎకరాల ఆయకట్టు సాగయ్యే అవకాశం ఉంది.

ఎగువ సగిలేరు ప్రాజెక్టు : పోరుమామిళ్ల చెరువు నీటి మళ్లింపునకు ఉద్దేశించి ఆనకట్టు తర హాలో నిర్మించారు.

విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పిఇటి సస్పెన్షన్ : డిఇఒ



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ పురుషోత్తం

ప్రజాశక్తి-మదనపల్లె

పదవ తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పిఇటి గోపీనాథ్‌ను సస్పెండ్ చేసినట్లు డిఇఒ పురుషోత్తం తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ సంఘటనపై బాధిత విద్యార్థినిని, తల్లిదండ్రులను విచారించారు. పిఇటి అసభ్య ప్రవర్తన నిజమని తేలడంతో సస్పెండ్ చేసినట్లు చెప్పారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాంశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి ఫిర్యాదుతో విచారణకు వచ్చానన్నారు. పాఠశాలలో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉపాధ్యాయులు చూడాలని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారి శాఖా పరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇదే పాఠశాలలో గతవారం మరొక విద్యార్థిని పట్ల మరో ఉపాధ్యాయుడు సైతం అసభ్యంగా ప్రవర్తించారని విలేకరులు డిఇఒను అడుగగా తన దృష్టికి రాలేదని తెలిపారు. సమావేశంలో హెచ్ఎం సుబ్బారెడ్డి, ఎంఇఒలు రాజగోపాల్, కరుణాకర్ పాల్గొన్నారు.

పిఇటిపై దిశ చట్టం కేసు నమోదు చేయాలి : సిపిఎం

పదవ తరగతి విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన పిఇటిపై దిశ చట్టం కింద కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఆటపాటలతో పాటు క్రమశిక్షణ నేర్పించాల్సిన గురువులు వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. పాఠశాలకు మంచి చరిత్ర ఉన్నదని, అలాంటి పాఠశాలలో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడడం హేయమైన చర్యగా ఖండించారు. వేధింపులకు పాల్పడిన పిఇటి గోపీనాథ్‌పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పిఇటి గోపీనాథ్ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన విషయంపై కలకడ మండలంలో గతంలో సస్పెండ్ అయ్యారన్నారు. ఆయన పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వివరించారు. విద్యార్థినుల పట్ల తన ప్రవర్తన మార్చుకోని ఉన్మాది పిఇటి గోపీనాథ్ అని పేర్కొన్నారు. ఇతనిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. ఉన్నతాధికారుల వెంటనే స్పందించి శాఖపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

చర్మ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-మదనపల్లె

మహిళ చర్మ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ ప్రతిమగుప్తా అన్నారు. శుక్రవారం మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో మహిళలకు వచ్చే చర్మ వ్యాధులపై, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందమైన, మచ్చలు లేని, మృదువైన చర్మం కావాలని ప్రతి ఒక్క అమ్మాయి కోరుకుంటుందని ఐతే రుతుక్రమంలో హార్మోన్ల అసమతుల్యత, ఒత్తిడి, కాలుష్యం, చెడు ఆహార అలవాట్లు, జన్యుపరమైన కారణాల వల్ల అనేక చర్మ సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారన్నారు. ఈ చర్మం సమస్యల కారణంగా అందవిహీనంగా మరతారని దీని వల్ల నలుగురిలోకి వెళ్లడానికి వెనకాడుతుంటారన్నారు. మహిళలు తమ చర్మ సమస్యలకు తక్షణమే పరిష్కారాలను మరియు సంభందిత డాక్టర్‌ను సంప్రదించి జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. నేటి కాలంలో చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరిలో చర్మ సమస్యలు పెరిగిపోతున్నాయి. చర్మం శరీరంలోనే అతిపెద్ద అవయవం. శరీరం లోపల ఉండే భాగాలను రక్షించటం, శరీర ఉష్ణోగ్రతను నియంత్రించటం చర్మం యొక్క ముఖ్యమ్కైన పని. శరీర పోషణకు అవసరమయ్యే నీరు, విటమిన్లు, కొవ్వులను సైతం చర్మం నిల్వ చేస్తుంది. చర్మంపై కెరాటిన్, ఫైబ్రోస్ ప్రోటీన్, లిపిడ్స్ వంటివి ఉండటం వల్ల హానికరమైన బాక్టీరియా, వైరస్ కారక క్రిములు శరీరం లోకి ప్రవేశించకుండా కాపాడుతుంటుందన్నారు. చర్మం యొక్క రంగు అనేది వారసత్వంగా రావచ్చన్నారు. తరచుగా చర్మ వ్యాధులతో బాధపడేవారు కొన్ని సాధారణ పద్ధతులను పాటించడం ద్వారా కొంత ఉపశమనం పొందవచ్చన్నారు. విటమిన్-సి ఎక్కువగా ఉండే నారింజ, స్ట్రాబెర్రీలు, యాపిల్స్, పుచ్చకాయ, అరటిపండు, బొప్పాయి వంటి వాటిని తీసుకోవాలని సూచించారు. గ్రీన్ టీ, సాల్మన్ చేపల్లో యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉండడం వల్ల చర్మ సంరక్షణకు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో ఐఐసికో-ఆర్డినేటర్ డాక్టర్ గీతాదేవి, ఇంటర్నేషనల్ సెల్ సీనియర్ మేనేజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వర్ణ

చదువుకునే వయసులో పెళ్లిళ్లు వద్దు

ప్రజాశక్తి-పీలేరు

ఆడపిల్లలు బడికెళ్లి చదువుకోవాల్సిన వయసులో పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపడం మంచిది కాదని ఐసిడిఎస్ సూపర్వైజర్లు పి.స్వర్ణ, కె.అక్కయ్య, ప్రిన్సిపల్ రాధారాణి తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనలో భాగంగా శుక్రవారం ఎంజెపిఎపిబిసిడబ్ల్యూఆర్(జి) స్కూల్లో బాలికలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు ఆడపిల్లలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, అలా చేస్తే శిక్షార్హులు అవుతారని తెలిపారు. బాల్య వివాహాలు నిర్మూలించడానికి ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్లు 1098,181,112,100 గురించి వివరించారు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల శారీరక, మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చదువుకోవాల్సిన వయసులో వివాహం చేసుకుని ఇబ్బందులు ఎదుర్కోవడం కంటే చక్కగా చదువుకుని ఆర్థికంగా ఎదిగిన తర్వాత వివాహం చేసుకుంటే ఏ సమస్యలూ ఉండవన్నారు. బాల్య వివాహాల నిర్మూలనా చట్టం 2006 గురించి వివరించారు. మహిళా పోలీసు సరిత మాట్లాడుతూ బాల్య వివాహాలపై మీకు ఎటువంటి ఒత్తిడి ఉన్నా లేక మీతోటి విద్యార్థులు బాధపడుతున్నా వెంటనే సమాచారం ఇస్తే బాల్య వివాహాన్ని అడ్డుకుని వారిని సంరక్షించడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు భూదేవి, ధనలక్ష్మి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉర్దూ స్కూల్‌లో ఆగిపోయిన భవన నిర్మాణ పనులు

ఆగిన ఉర్దూ ఉన్నత పాఠశాల భవన నిర్మాణాలు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలో ఆరు ఉన్నత పాఠశాలలో ఉన్నాయి. పెద్దూరులోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. నాడు-నేడు కింద ఎంపికైన ఈ పాఠశాలలో విడుదలైన నిధులతో అదనపు గదుల నిర్మాణాలు చేపట్టారు. భవన నిర్మాణాలు చేపట్టారు కానీ మూత, కాంక్రీట్ వేయకుండా అలాగే వదిలేశారు. రెండో విడతలో మంజూరైన నిధులతో బాల, బాలికలకు మరగుదొడ్లు నిర్మాణాలు చేపట్టినట్లు తెలుస్తోంది. మూడు నెలలు గడిస్తే ఈ విద్యాసంవత్సరం కూడా ముగియనుందని, ఇక భవన నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో భవన నిర్మాణాలు పూర్తి చేస్తే సౌకర్యంగా ఉంటుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

'ఎల్‌ఐపి'ని సమర్ధవంతంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-కలకడ

పాఠశాలలలో ఎల్‌ఐపి కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని ఎంఇఒ మునీంద్రనాయక్ ప్రధానోపాధ్యాయులు చంగల్‌రాయుడు కోరారు. శుక్రవారం మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఎల్‌ఐపి శిక్షణ రెండు రోజుల కార్యక్రమం కలకడ మోడల్ స్కూల్ లో కలకడ కలికిరి సమ్మెపల్లి మండల ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని సూచనలు ఇవ్వడం జరిగింది. 6,7,8 తరగతి చదువుతున్న విద్యార్థులలో చదవడం, రాయడం, అభ్యసన సామర్థ్యాలను తప్పక సాధించాలని సూచించారు. గణిత సామర్థ్యాలను కూడా విద్యార్థులు సాధించే విధంగా బోధన ఉండాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ రెడ్డిశేఖర్‌రెడ్డి, కేదారేశ్వర, చక్రపాణి, శ్రీరాములు, యోగేంధర్‌రెడ్డి, సహదేవయ్య, భాస్కర్, రమణ, త్యాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిసెంబర్ 15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి-రామాపురం

డిసెంబర్ 15 నుంచి జనవరి 26 వరకు ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ హైదరవల్లి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27 నుంచి అర్హులైనలో క్రీడాకారులురిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభమవుతుందని ఆయన అన్నారు. అర్హులైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోనే వారు ఆయా గ్రామాల సచివాలయాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ క్రీడా కార్యక్రమానికి 15 ఏళ్ల పైబడిన బాల బాలికలు, క్రికెట్, వాలీబాల్, కబాడీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ క్రీడలు మండల స్థాయిలో 43రోజులు నిర్వహిస్తారని తెలిపారు. వాలంటీర్ల ద్వారా ఇంటింటికి సందర్శించి క్రీడాకారుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఒకవేళ క్రీడాకారులే గ్రామ సచివాలయాల్లో వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోనుటకు వెసులుబాటు ఉంటుందన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రజలు ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచుకొని ఆ మహమ్మారిని తరిమికొట్టాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారి పేర్కొన్నారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో శుక్రవారం హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ షేక్ అల్లావలి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని అన్నారు. జీవితభాగస్వామితోనే లైంగిక సంబంధం కలిగి ఉండాలని సూచించారు. ఎయిడ్స్ రోగులను అసహ్యించుకోకుండా ప్రేమ, సానుభూతిని చూపించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం రెడ్డయ్య , సిసిలు, యానిమేటర్లు, మండలస్థాయి విఒలు, షేక్ మహబూబ్ బాషా, వాలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి-సుండుపల్లి

టి.సుండుపల్లి సర్పంచ్ నిధుల దుర్వినియగం పిఎన్‌కాలవ గ్రామ ప్రజలు సంబంధిత ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో నియోజకవర్గ పంచాయతీ డిఎల్‌పిఒ పార్వతి, వార్డు మెంబర్లతో సర్పంచ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తమకు ఫిర్యాదు చేసిన ఐదు అంశాలకు సంబంధించి విచారణ చేపట్టి, రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారాన్ని జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని చెప్పారు. పిఎన్ కాలవ గ్రామంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆ గ్రామ ప్రజలు పలువురు అధికారి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పూర్తిగా విచారణ చేపడతామని తమకు ఏదైనా సమస్యలు ఉంటే రాతపూర్వకంగా తమకు తెలియజేయాలని వివరించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక హరజత్ బాబా ఉరుసు

ప్రజాశక్తి-నందలూరు

మత సమరస్యానికి ప్రతీకగా ఉరుసు ఉత్సవం నిలుస్తోందని నియోజకవర్గ జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. నందలూరు గ్రామపంచాయతీలోని హజరత్ మగ్దుం బాబా ఉరుసు మహోత్సవంలో పాల్గొన్నారు. దర్గా నిర్వాహకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు.దర్గాలో పూలచాదర్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రతి కార్యక్రమంలో తన వంతు సహ కారం అందిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా దర్గా అభివృద్ధికి రూ.50 వేల రూపాయలు విరాళాన్ని మత పెద్దలకు అందించారు. కార్యక్రమంలో నందలూరు మాజీ జడ్‌పిటిసి శివరామరాజు, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు, ఎంపీటీసీ సుభాన్ , అజీజ్, బిజెపి నాయకులు షబ్బీర్ అహ్మద్, జుల్ఫికర్, షాకీర్, ఆకులు చలపతి, రాజంపేట నాయకులు సింగంశెట్టి నరేంద్ర, నాసర్‌ఖాన్, మౌలా, పత్తి నారాయణ, నందలూరు జనసేన నాయకులు గురివిగారి వాసు, మండెం రాము,మస్తాన్ రాయల్, సాయి పవన్, హరీష్, ఇస్మాయిల్, చోటు, మిషారి పాల్గొన్నారు.



దర్గా అభివృద్ధికి విరాళం అందిస్తున్న శ్రీనివాసరాజు

పాఠశాలకు వెళ్లాలంటే భయం..భయం

రోడ్డంతా మురుగునీటి మయం - ఇబ్బందుల్లో విద్యార్థులు పట్టని అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు పంచాయతీలోని సలాది ఎస్‌సికాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు వెళ్లాంటే ఉపాధ్యాయులు, విద్యార్థులు భయ పడుతున్నారు. గురువారం కురిసిన వర్షానికి చుట్టుపక్కల నంచి వచ్చిన వర్షనీరు పాఠశాలకు వెళ్లే రహదారిపైకి చేరి మడుగను తలపిస్తోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలల్లోకి వెళ్లాలంటే బురదనీటిలో నుంచే వెళ్లే పరిస్థితి ఏర్పడింది. చిలకలూరిపేట నుంచి మురుగనీరు, వర్షపునీరు పాఠశాల దిగువభాగంలో ఉన్న పాఠశాల ముందుకు వచ్చి అక్కడే నిలిచిపోతుం డటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో చది వేది చిన్నపిల్లలు కావడంతో కాలుజారి బురదలో పడి గాయాల పాలవుతున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారి నుంచే అరవీటివారిపల్లి , నాయుడువారిపల్లి, ఉత్తర గడ్డ ఎస్‌సి కాలనీ, అరవీటిపల్లి జగనన్న కాలనీకి వెళ్లే ప్రజలందరూ వెళ్తూ ఉంటారని అన్నారు. వాహనదారులు కూడా ఇబ్బందులు గురవు తున్నారని, వాహనాలు వచ్చినప్పుడు బురద ఉపాధ్యాయులు, విద్యార్థులపై పడుతోందన్నాని తెలి పారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిపెట్టి పాఠశాల వెళ్లే రోడ్డులో ఉన్న మురుగునీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠశాలకు వెళ్లే దారిలో నిలిచిన మురుగునీరు

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి: జెసి



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జెసి ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హాజరయ్యారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 103 ప్రజా ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ గ్రామ, మండలస్థాయి సమస్యలను మండల పరిధిలోనే పరిష్కరించుకోవాలన్నారు.ముఖ్యంగా ప్రజలు, రైతుల నుండి భూసమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వాటి పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చొరవ చూపాలన్నారు. గ్రామ,వార్డు సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు సమన్వయం చేసుకుని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు బదిలీ చేశామని ఎంపిడిఒ శంకరయ్య తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

మళ్లీ జగన్‌కే మద్దతు ఇద్దాం : ఎంపిపి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డికే మద్దతు ఇద్దామని ఎంపీపీ నరసింహులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నిమ్మనపల్లిలోని సచివాలయం, బస్టాండ్ కూడలి వద్ద వైసిపి పార్టీ జెండాను మండల కన్వీనర్ సదాశివరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్ ఆర్ ఐ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామ మోహన్ రెడ్డి, స్థానిక వైఎస్‌ఆర్‌సిపి నాయకులు విజయ్ కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలతో కలిసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 'వై ఏపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకపోతామన్నారు. గత ప్రభుత్వాలు, పాలకుల కంటే జగనన్న హయాంలో ప్రజలకు సంక్షేమ పథకాలు విరివిగా లభిస్తున్నాయని అన్నారు. సంక్షేమం పథకాలు, రాష్ట్ర అభివృద్ధి యధావిధిగా కొనసాగాలంటే రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డే రావాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచులు సుబ్రమణ్యం, చెంద్రాయుడు, మహదేవరెడ్డి, ఎంపిటిసి రెడ్డివెంకటేష్, నాయకులు జివి.రమణారెడ్డి, శశిధర్ రెడ్డి, శ్రీనివాసులు, నవీన్, హేమంత్, హోటల్ రఫీ, మౌలాలి, కార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ :** భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపిపి శ్రీదేవిరవికుమార్ పేర్కొన్నారు.మండల కేంద్రమైన కలకడ సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ చేసి తర్వాత పార్టీ జెండాను బస్టాండ్ దగ్గర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ దేశానికి ఆదర్శంగా మన రాష్ట్రం ఉందని ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా చేపడు తున్నారని అన్నారు. సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పాలనను అంది స్తున్నారని అన్నారు. మెరుగైన పాలన కోసం మరల సిఎం జగన్‌కే ప్రజలు పట్టం కట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు షౌకత్ అలీఖాన్, సుల్తాని, కరీముల్లా, మాజీ సర్పంచ్ జిలానీబాషా, ఎంపిటిసి ముబారక్ భాషా, కో-ఆప్షన్ నెంబర్ ఇనయతుల్లా. ఉపసర్పంచ్ అక్రమ్, ఇఒఆర్‌డి లతీఫ్ ఖాన్,సెక్రటరీ సద్దాం హుస్సేన్ ,సచివాల సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** రాష్ట్రంలో కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించి ఆర్థిక అభివృద్ధికి సహకరించిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిదే అని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. ఎద్దులవారిపల్లెలో వైఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. పార్టీ పతాకాన్ని, సంక్షేమం, అభివృద్ధి సమాచారంతో కూడిన డిజిటల్ బోర్డు, బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. మరోమారు, ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఆనంద్ కుమార్, వాటర్ షెడ్ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు కరీముల్లా, గంట్ల సురేంద్ర, సత్తార్ పాల్గొన్నారు.



వైసిపి జెండా ఆవిష్కరణలో ఎంపిపి శ్రీదేవిరవికుమార్

ప్రతి సమస్యకూ పరిష్కారం :'నల్లారి'



కలికిరి : మాట్లాడుతున్న నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి


ప్రజాశక్తి-కలికిరి

ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండే పరిష్కార మార్గం చూపుతానని జాతీయ టిడిపి ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రజలకు హామీనిచ్చారు. శుక్రవారం భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మర్రికుంటపల్లి పంచాయతీ గజ్జలవారిపల్లెలో టిడిపి-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోతో ఆయన ప్రజల్లోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యకు ముందుండి పరిష్కారమార్గం చూపించి గ్రామాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తానని అన్నారు. టిడిపి-జనసేన మరో ఉమ్మడి మేనిఫెస్టోతో ప్రజల్లోకి రానుందని అదికూడా ప్రజల్లోకి పెద్దఎత్తున ప్రచారం చేపడుతామని అన్నారు. నల్లారి కుటుంబంపై మీరు చూపించే అభిమానం మరువలేనిదని అన్నారు. వచ్చేఎన్నికల్లో ఓటువేసి అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామానికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అందరిని ఆదుకొంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల టిడిపి అధ్యక్షుడు ఆర్ సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహిం చారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసి పేద, బడుగు బలహీన వర్గాలు, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగు నింపడమే టిడిపి లక్ష్యమని అన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న వైసిపికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పోలి జగదీశ్వర్ రెడ్డి, రంగారెడ్డి, మనోహర్ నాయుడు, ప్రభాకర్ నాయుడు, జనసేన నాయకులు రామ్మూర్తి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి : డాక్టర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా డిసిహెచ్‌ఎస్ డాక్టర్ డేవిడ్‌కుమార్ పేర్కొన్నారు.శుక్రవారం బి.కొత్తకోట పట్టణంలోని సిహెచ్‌సిని ఆయన సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు,వైద్య సిబ్బందికి పలు సూచనలు,సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నాడు-నేడు ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులకు రాష్ట్ర ప్రభుత్వం మహర్దశను తీసు కొచ్చిందన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సాధ్యమైనంవరకు ప్రసవాలు ఇక్కడే జరిగే విధంగా చూడాలని తెలిపారు. హైరిస్క్ కేసులను మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించాలని సూచించారు.ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించినప్పుడే ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్యులు డాక్టర్ అరీఫ్, డాక్టర్ హసీనా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ డేవిడ్‌కుమార్

పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ

పుల్లంపేట : మండల పరిధిలోని ఎస్‌బివిడి సభ పాఠశాలకు ఎంఇఒ చక్రధర్‌రాజు, సభ సంస్థల కరస్పాండెంట్ నూకల శ్రీరాములు శుక్రవారం ఉపాధ్యాయులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారుల కోసం అందిస్తున్న క్రీడ సామాగ్రిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. క్రీడాకారులు కూడా ప్రభుత్వం క్రీడల కోసం ఎంతగానో సహకరిస్తుందని దానిని దృష్టిలో ఉంచుకొని అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొనాలని తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా సమానంగా విద్యార్థులు రాణించాలని కోరారు. కార్యక్రమంలో సిఆర్‌పి శివ, ఆనంద్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ఎస్‌బివిడి సభ ప్రాంగణంలో శుక్రవారం ఓపెన్ స్కూల్ రాష్ట్ర పరిశీలకులు అక్బర్ అలీ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేసినట్లు ఎంఇఒ అధికారి చక్రధర్‌రాజు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకులు అక్బర్ అలీ మాట్లాడుతూ పదవ తరగతిలో తప్పిన విద్యార్థులు విద్యాభివృద్ధి పెంపొందించేందుకు ప్రభుత్వం ఓపెన్ స్కూల్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఓపెన్ స్కూల్లో కూడా విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకున్న వారు చాలామంది ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్ రెడ్డి, ఉపాధ్యాయ నాయకుడు నరేంద్రనాథ్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర పరిశీలకులు అక్బర్ అలీ



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రానికి నివాళి అర్పిస్తున్న రెడ్డిసంఘం నాయకులు

ఘనంగా 'ఉయ్యాలవాడ' జయంతి

ప్రజాశక్తి-కలికిరి

స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి వేడుకలు కలికిరి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ధరణిహోటల్ దగ్గర ఘనంగా నిర్వహించారు. ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ శక్తివంతమైన బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి పోరాడి సమర శంఖం పూరించి, తెలుగు వారి పౌరుషాన్ని రుచి చూపించిన రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అంటూ కొనియాడారు. కార్యక్రమంలో రెడ్డిసంఘం ఉపాధ్యక్షులు రాంప్రసాద్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు ఆదినా రాయణరెడ్డి, శేష్ కుమార్‌రెడ్డి, శేషాద్రిరెడ్డి, కె.రెడ్డెప్పరెడ్డి, చంద్రారెడ్డి, వెంకటరమణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పునరుద్ధరణ

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

ప్రజాశక్తి దినపత్రిలో బుధవారం 'కూలిన విద్యుత్ స్తంభం'అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు విద్యుత్ అధికారులు స్పందించారు. కూలిన విద్యుత్ స్తంభాన్ని నెలకొల్పి ఆగిపోయిన విద్యుత్‌ను పున రుద్ధరించారు. విద్యుత్ అంతరాయం ఉన్న మంగళకాలనీ, సలాది కాలనీలకు విద్యుత్తును పునరు ద్ధరించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.



ఏర్పాటు కేసిన విద్యుత్ స్తంభం



శిక్షణ ఇస్తున్న జిల్లా కో-ఆర్డినేటర్ నాగరాజు

అంగన్వాడీ కేంద్రాలకు మరమ్మతులు : పీడీ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 96 అంగన్వాడీ కేంద్రాలకు మరమ్మతు పనులు మంజూరయ్యాయని ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి అన్నారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కో-ఆర్డినేటర్ నాగరాజు సూపర్వైజర్లకు, అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సిడిపిఒ డిపి.సౌభాగ్యమ్మ, ఎసిడిపిఒ టి.సరళ దేవి, పీడీ కార్యాలయ టెక్నికల్ సిబ్బంది, స్థానిక సూపర్వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఉమర్‌ఫరూక్

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

-న్యాయమూర్తి ఉమర్‌ఫరూక్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

యువత ,విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉన్నత ఆశయంతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షుడు న్యాయమూర్తి ఉమర్‌ఫరూక్ తెలిపారు. శుక్రవారం స్థానిక టిఎన్.వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటిఐలో న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు తమ హక్కులను తెలుసుకోవాలన్నారు. హక్కులపై అవగాహన ఉన్నప్పుడే హక్కులను సాధించుకోగలరున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. మొలకలచెరువు ఎక్సైజ్ సిఐ మల్లికా మాట్లాడుతూ యువత మత్తుకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మద్యం, గంజాయి వంటి మత్తుకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టిఒ నాగరాజు, ఇన్స్పెక్టర్లు, ఐటిఐ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందనలు

పీలేరు : పీలేరు ఆర్టీసి డిపోలో అత్యధిక ఇంధన పొదుపు, ఆదాయం సాధించిన ఉద్యోగుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక గ్యారేజ్‌లో 107 లీటర్ల డీజిల్ ఆయిల్ పొదుపు సాధించిన డ్రైవర్ బిఆర్‌సి నాయక్‌కు ప్రథమ బహుమతిగా రూ.500, ద్వితీయ బహుమతిగా డ్రైవర్ బి.ఎర్రయ్యకు రూ.300 నగదు బహుమతిని అందించి అభినంచినట్లు డిపో మేనేజర్ బండ్లకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో ప్రతి డ్రైవర్ ఇదే స్ఫూర్తితో ఇంధన పొదుపులో మెళకువలు తెలుసుకుని ఇంధన వినియోగంపై ఖర్చు తగ్గించి డిపో అభివృద్ధికి సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో గ్యారేజ్ ఇంచార్జ్ హరినాథ్ రెడ్డి, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ బి.ఆనంద్, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నలుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ ఎర్రాతివారిపల్లి సమీపంలో కొంతమంది జూదం ఆడుతున్నట్లు సమాచారం అంద డంతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న సోమానుపల్లి కాలనీకి చెందిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,080 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

ప్రజాశక్తి-చిన్నమండెం

పెద్దమండెం రహదారిలో నడిచి వెళుతున్న రెడ్డివారిపల్లెకు చెందిన ఎం.కాటమయ్య అనే వృద్ధుడిని ఆర్‌టిసి బస్సు శుక్రవారం ఉదయం ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడికి కాలు పూర్తిగా విరగడంతో బాధితుడిని అతని బంధువులు రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు.